
andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
నిజామాబాద్ జిల్లా వార్తలు
3
మంగళవారం 12 మార్చి 2024



నిజామాబాద్, జహీరాబాద్ లోక్‌సభ స్థానాలపై బీఆర్‌ఎస్ దృష్టి



- ఈ రెండు స్థానాలను బీసీలకే కేటాయించేందుకు పార్టీ అధిష్ఠానం నిర్ణయం
- నిజామాబాద్ అభ్యర్థిగా బాజిరెడ్డి, జహీరాబాద్ అభ్యర్థిగా అనిల్‌కు అవకాశం
- ఇప్పటికే ఈ రెండు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ
- జహీరాబాద్ అభ్యర్థిని ప్రకటించిన కాంగ్రెస్


ఆదివారం హైదరాబాద్‌లో జహీరాబాద్ బీఆర్‌ఎస్ నేతలతో భేటీ అయిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

నిజామాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీఆర్‌ఎస్ అధిష్ఠానం నిజామాబాద్, జహీరాబాద్ లోక్‌సభ స్థానంపై దృష్టి పెట్టింది. ఈ రెండు పార్లమెంట్ స్థానాలపై పరిధిలో బీసీ అభ్యర్థులనే నిలబెట్టేందుకు సన్నద్ధమవుతోంది. ఇప్పటికే అభ్యర్థుల ఎంపికను పూర్తిచేసిన పార్టీనేతలు ఒకటి రెండ్రోజుల్లో ప్రకటించే అవకాశం ఉంది. ఇప్పటికే జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని నేతలతో ఒకదఫా చర్చించిన పార్టీ అధిష్ఠానం ఖాళీగా ఉన్న అన్ని పార్లమెంట్ అభ్యర్థులను ప్రకటించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. కాగా, ఈ పార్లమెంట్ ఎన్నికలు బీఆర్‌ఎస్‌కు కూడా కీలకం కానున్నాయి. కాంగ్రెస్, బీజేపీలకు దీటుగానే బీఆర్‌ఎస్ అభ్యర్థులను నిలబెట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే బీజేపీ జహీరాబాద్ అభ్యర్థిగా ఎంపీ బీబీ పాటిల్, నిజామాబాద్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ అర్వింద్‌ను ప్రకటించింది. వారు ప్రచారాన్ని కూడా మొదలుపెట్టారు. కాంగ్రెస్ మొదటి జాబితాలో జహీరాబాద్ అభ్యర్థిగా మాజీ ఎంపీ సురేష్ షెట్కర్‌ను ప్రకటించింది. ఈ రెండు నియోజక వర్గాల పరిధిలో పార్టీ సీనియర్ నేతలను కాంగ్రెస్ ఎన్నికల బరిలో దించుతుంది. జహీరాబాద్ ప్రకటించగా నిజామాబాద్ అభ్యర్థిని రెండో జాబితాలో ప్రకటించేందుకు ఆ పార్టీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. కరీంనగర్ పార్లమెంట్‌తో ముడిపడి ఉండడంతో జీవన్ రెడ్డి అభ్యర్థిత్వంవైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

త్వరలో ఎన్నికల షెడ్యూల్

ఈ రెండు పార్లమెంట్‌లకు అభ్యర్థుల ప్రకటన బీజేపీతో పాటు కాంగ్రెస్ చేయడంతో బీఆర్‌ఎస్ కూడా త్వరితగతిన ప్రకటించేందుకు సిద్ధమవుతుంది. ఈనెల 14 లేదా 15న పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉండడంతో దానికి ముందుగానే అభ్యర్థులను ప్రకటించనున్నారు. షెడ్యూల్ రాగానే ప్రచారం చేసుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాలకు బీఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రకటించిన పార్టీ అధ్యక్షులు, మాజీ సీఎం కేసీఆర్ ఈ రెండు నియోజకవర్గాల్లో బీసీ అభ్యర్థులను బరిలోకి దించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్‌ను నిర్ణయించినట్లు సమాచారం. ఒకటి రెండ్రోజుల్లో ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రకటించనున్నారు. ఆర్మూర్, నిజామాబాద్ రూరల్, బాన్సువాడ ఎమ్మెల్యేగా నాలుగు దఫాలు పనిచేసిన ఆయనకు ఉమ్మడి జిల్లా పరిధిలో పరిచయాలు ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా పరిధిలో అన్ని నియోజకవర్గాల్లో ఆయన అనుచరులు ఉన్నారు. బీసీ కావడం, మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాల్లో బీసీలు ఎక్కువగా ఉండడం వల్ల కలిసి వస్తుందని పార్టీ అధ్యక్షులు భావించినట్లు సమాచారం. ఆయనను నిర్ణయించడం వల్ల పార్టీలోని అన్ని వర్గాల నేతలు కలిసిపని చేస్తారని అంచనాకు వచ్చి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రకటించే ముందు పార్లమెంట్ పరిధిలోని రెండు జిల్లా లకు చెందిన పార్టీ నేతలతో కూడా సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సమాచారం. ఇప్పటికే ముగ్గురు ఎమ్మెల్యేలతో పాటు మాజీ ఎమ్మెల్యేల అభిప్రా యాలను అధ్యక్షులు తీసుకుని ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ దఫా అభ్యర్థిని ప్రకటించడంతో పాటు పార్టీ నేతలందరు జిల్లాలో ఉండి ప్రచారంలో పాల్గొనే విధంగా ముందస్తుగానే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా అనిల్‌ను ప్రకటించనున్నారు. పటాన్ చెరుకు చెందిన ఆయన పార్టీలో కీలకంగా ఉండడం వల్ల ఈ దఫా జహీరాబాద్ సీట్ కేటాయిస్తున్నట్లు పార్టీనేతల సమాచారం బట్టి తెలుస్తోంది. రెండు రోజుల క్రితం జరిగిన సమావేశంలో కూడా నేతలందరికీ ఇదే విషయాన్ని వివరించినట్లు సమాచారం. ఈ రెండు పార్లమెంట్ స్థానాలకు ఒకటి రెండ్రో జుల్లో వీరి పేర్లను అధికారికంగా ప్రకటించనుండ గా ఇప్పటికే పార్టీ నేతలకు తెలియడం వల్ల ఏర్పాటలో నిమగ్నమవుతున్నారు. అభ్యర్థిత్వాలను ప్రకటించగానే ప్రచారాలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ లోపే కాంగ్రెస్ అభ్యర్థిని కూడా ప్రకటిస్తే అన్ని పార్టీల ప్రచారాలు జోరందుకునే అవకాశం ఉంది.

మోదీ కోసం ప్రతీ ఒక్కరు సైనికుల్లా పని చేయాలి

- ఎంపీ ధర్మపురి అర్వింద్


బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ధర్మపురి అర్వింద్


నందిపేట, మార్చి11: దేశాన్ని ప్రపంచ స్థాయిలో నిలుపేందుకు అహర్నిషలు పని చేస్తున్న దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కోసం ప్రతీ ఒక్కరు సైనికుల్లా పని చేయాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని పద్మశాలి సంఘం ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన నందిపేట, డొంకేశ్వర మండలాల బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్కడ దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ గెలవడం, ఇక్కడ నిజామాబాద్ ఎంపీగా తాను గెలవడం ఖాయమని అర్వింద్ ధీమా వ్యక్తం చేశారు. మోదీ చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు బీజేపీ ఎంపీ అభ్యర్థులను గెలిపిస్తాయని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కులచారి దినేష్, సీనియర్ నాయకులు ఆరె గంగాధర్, అబ్బి గంగారాం, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే ఔట్‌లెట్లు ప్రజల విశ్వాసాన్ని పొందుతాయి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు


పెట్రోల్‌బంక్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ; పక్కన సీపీ

ఖిల్లా, మార్చి 11: ప్రైవేటు పెట్రోల్ బంక్‌ల కంటే ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే ఔట్‌లెట్ ప్రజల విశ్వాసాన్ని పొందుతాయని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. పోలీసు వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ ఆవరణలో పెట్రోల్ బంక్‌ను సీపీ కల్మేశ్వర్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలీసు శాఖ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పెట్రోల్ బంక్ నుంచి వచ్చే లాభాలను పోలీసు కుటుంబాల సంక్షేమానికి వెచ్చించనున్నామని తెలిపారు. అనంతరం సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లో ఇలాంటి పెట్రోల్‌బంక్ పోలీస్ శాఖలో ఏర్పాటు చేయడం ఇదే మొదటి సారి అని అన్నారు. ఈ పెట్రోల్‌బంక్‌ను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సహకారంతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషనరీ ఐపీఎస్ బి.చైతన్యరెడ్డి, సీజీఎఫ్ శుభ్రత్‌రత్, సీనియర్ మేనేజర్ మోహన్ కిశోర్, ఏసీపీలు రాజావెంకట్‌రెడ్డి, నాగయ్య, ఐవోసీఎల్ ఆఫీసర్ క్రాంతికుమార్, రిజర్వు ఇన్స్‌పెక్టర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



నేటి నుంచి రంజాన్ మాసం

- నెల వంక దర్శనం
- నేటి నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభం

కమ్మర్‌పల్లి/నాగిరెడ్డిపేట, మార్చి 11: ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ మాసం వచ్చేసింది. సోమవారం రాత్రి నెలవంక దర్శనం ఇవ్వడంతో మంగళవారం ఉదయం నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభమవుతాయి. దీంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నెల రోజుల పాటు అధ్యాత్మిక సందడి నెలకొననుంది. ముస్లింల పవిత్ర గ్రంథమైన ఖురాన్ రంజాన్ మాసంలోనే అవతరించబడింది. దైవ ప్రవక్త హజ్రత్ మహమ్మద్ ముస్తాఫా సల్లల్లాహు అలైహి వసల్లంపై ఖురాన్‌ను సృష్టికర్త అల్లాహ్ అవతరింపజేశారని ముస్లింల విశ్వాసం. రంజాన్ మాసంలో ఖురాన్ అవతరించబడటంతో ఈ మాసానికి అత్యంత ప్రాధాన్యత కలిగింది. దీంతో రంజాన్ మాసంలో ప్రతి ముస్లింలు నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు పాటిస్తారు. దీక్షాపరులు ప్రతిరోజూ ఐదుసార్లు నమాజ్ చేస్తూ, ఖురాన్‌ను పఠిస్తూ, దైవ చింతనలో గడుపుతారు. ప్రతిక్షణం అల్లాహ్ నామస్మరణతో నిమగ్నమవుతారు.

కఠోర ఉపవాస దీక్షలు

ముస్లింలు వయో, లింగ బేధం లేకుండా రంజాన్ మాసం కఠోర ఉపవాస దీక్షలను పాటిస్తారు. సూర్యోదయానికి ముందే తెల్లవారు జామున రంజాన్ మాసపు ప్రత్యేక క్యాలెండర్ ప్రకారం నిర్ణీత సమయానికి సహర్ వేళలో భోజనం ముగించుకుని అప్పటి నుంచే ఉపవాస దీక్షను ప్రారంభిస్తారు. తిరిగి సాయంత్రం సూర్యాస్తమయం అయ్యాక ఇఫ్తార్‌తో దీక్షను ఖర్జూర పళ్లతో, డ్రై ఫ్రూట్స్, వివిధ రకాల పండ్లు, ఫలాలతో దీక్షను విరమిస్తారు. దైవ ప్రవక్త హజ్రత్ మహ్మద్ ఖర్జూరంతోనే ఉపవాస దీక్షను విరమించే వారని విశ్వసించే ముస్లింలు ఖర్జూరలతోనే ఉపవాసాన్ని విరమిస్తారు. ఉపవాస దీక్షతో సర్వపాపాలు తొలగిపోతాయని ముస్లింల విశ్వాసం.

రంజాన్ వేళలు

	మంగళవారం	బుధవారం
	ఇఫ్తార్	సహర్
	సా.6.31	ఉ.5.04



జ్ఞానాన్ని బోధించండి. సౌలభ్యాలను సృష్టించండి. కోపావేశం పెచ్చరిల్లినప్పుడు మౌనం వహించడం ఉత్తమ వ్యక్తి లక్షణం

పసుపునకు రికార్డు స్థాయి ధర

- నిజామాబాద్ మార్కెట్‌లో పెర్కిట్ రైతు పసుపునకు క్వింటా రూ.18,299



నిజామాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ మార్కెట్‌లో పసుపున కు భారీగా ధర వచ్చింది. పన్నెండేళ్లలో ఎప్పు డూ లేని విధంగా అత్యధికంగా పసుపునకు ధర పలికింది. మార్కెట్‌కు సోమవారం తీసుకువచ్చిన పెర్కిట్‌కు చెందిన తీగల గంగారెడ్డి అనే రైతుకు క్వింటా 18,299 రూపాయల ధర పలికింది. ఆ రైతు 18క్వింటాళ్లు తీసుకురాగా వ్యాపారులు అత్యధిక రేటుకు కొనుగోలు చేశారు. మార్కెట్‌కు సోమవారం 15వేల 800 క్వాంటాళ్ల పసుపు అమ్మకానికి వచ్చింది. మార్కెట్‌లో సరాసరి ధర 14వేల నుంచి 16వేల మధ్య అమ్మకాలు జరిగింది. మోడల్ ధర 14,250 రూపాయలు క్వింటాలుకు ఉండగా అతి తక్కువగా క్వింటాలు 8వేలకు అమ్మకం జరిగింది. ఈ సంవత్సరం మార్కెట్‌కు వచ్చిన పసుపులో అత్యధిక ధర ఈరోజే వచ్చింది. గత వారం మార్కెట్‌లో రూ.15,825 వరకు ధర రాగా ఈ రోజు మాత్రం అత్యధికంగా ధర పలికింది. జిల్లాతో పాటు ఇతర జిల్లాల్లో పసుపు సాగు విస్తీర్ణం తగ్గిపోవడం, ఎక్కువ దిగు బడి రాకపోవడం వల్ల మార్కెట్‌కు పసుపు ఎక్కువగా రావడం లేదు. గత ఆరేళ్లుగా పసుపు ధరలు తగ్గుతూ రావడంతో రైతులు పంటసాగును తగ్గించారు. ఈయేడు కేవలం 19వేల 500 ఎకరాల్లోనే సాగుచేశారు. జిల్లాలో ప్రతియేడు 40వేల ఎకరాలకు పైగా సాగైతే మార్కెట్‌కు 12లక్షల నుంచి 15లక్షల క్వింటాళ్ల వరకు పసుపు అమ్మకానికి వచ్చేది. మార్చి నెలలో 4నుంచి 5లక్షల క్వింటాళ్ల వరకు అమ్మకాలు జరిగేవి. ప్రస్తుతం సాగు తగ్గడం వల్ల ప్రతిరోజు 8నుంచి 15వేల క్వింటాళ్ల మధ్యనే పసుపు వస్తుంది. పసుపు పండించే తెలంగాణతో పాటు ఏపీ, మహారాష్ట్ర, తమిళ నాడు, అస్సాం, ఒరిస్సాలో సాగు తగ్గడం వల్ల కూడా డిమాండ్ పెరిగినట్లు వ్యాపారులు తెలిపారు. దేశ వ్యాప్తంగా పసుపునకు డిమాండ్ ఉండడం, ఇతర దేశాలకు ఎగుమతులకు అనుమతులు ఇవ్వడం వల్ల ఈ ధర పెరుగుతుంది. కొంత మంది వ్యాపారులు గ్రామాలకు వెళ్లి తమకు తెలిసిన రైతుల వద్ద ఎక్కువ ధరలు పెట్టి ఈ పసుపును కొనుగోలు చేస్తున్నారు.

పక్కనే ఉన్న మహా రాష్ట్రలోని సాంగ్లీ మార్కెట్‌లో కూడా క్వింటాలుకు 15వేల నుంచి 20వేల మధ్య ధర వస్తుండడంతో ఆ మార్కెట్‌కు దీటుగా నిజామాబాద్ మార్కెట్‌లో ఈ పసుపుకొనుగోళ్లు చేస్తున్నారు. మార్కెట్‌లో సోమవారం వచ్చిన ధర అత్యధికమని మార్కెట్ కార్యదర్శి వెంకటేశం తెలిపారు. ప్రతిరోజు పసుపు తీసుకువచ్చే రైతుల కోసం ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నామన్నారు. ఏరోజు పసుపు ఆరోజే అమ్మకాలు జరిగి రైతులకు డబ్బులు చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.


నందిపేటలో నిండుకున్న తాళ్లచెరువు

కాల్వలు ఇలా.. నీరు పారేదెలా?

- ముళ్లపొదలు, పిచ్చి మొక్కలతో నిండిపోయిన డి-74 కెనాల్
- ఆనవాళ్లు కోల్పోయిన డి-74/6
- గుత్ప నీరు చేరక నిండుకుంటున్న చెరువులు
- పశువుల తాగునీటికి ప్రశ్నార్థకమే
- ఆందోళనలో అన్నదాతలు


కొత్తూర్ శివారులో ఆనవాళ్లు కోల్పోయిన డి-74/6

నందిపేట, మార్చి 11: మండల పరిధిలోని నిజాంసాగర్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ-74 కెనాల్ ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలతో నిండిపోయింది. దాని పరిధిలోని పిల్ల కాలువలు పూర్తిగా ఆనవాళ్లు కోల్పోయాయి. అర్గుల్ రాజారాం గుత్ప ఎత్తిపోతల పథకం గ్రావిటీ కెనాల్‌కు నుంచి ఏర్పాటు చేసిన లింకు కెనాల్ ద్వారా పిల్ల కాలువలకు నీరు రాకుండా పూర్తిగా ధ్వంసం అయ్యాయి. నీటి వడుదల పూర్తి స్థాయిలో రాకుండా కెనాల్ మధ్యలో కొందరు వ్యక్తులు మట్టి కుప్పలు పోసి రోడ్డును తయారు చేసుకున్నారు. అంతే కాకుండా ఓపెన్ కెనాల్‌లో చెత్తా, చెదారం పారేశారు. అంతే కాకుండా పిచ్చి మొక్కలతో నిండి ఆనవాళ్లు కోల్పోయాయి. నందిపేట మండలంలోని ఆంధ్రనగర్ నుంచి చివరి ఆయకట్టు దత్తాపూర్ వరకు నిజాంసాగర్ ప్రాజెక్టు డి-74 కెనాల్‌కు పదుల సంఖ్యలో ఉన్న తూములు, పిల్ల కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని కూలిపోగ మరికొన్నింటిని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. మరికొన్నింటివి షట్టర్లను దొంగలు, ఆకతాయిలు ఎత్తుకెళ్లారు. గ్రామంలో ఉన్న ఇనుప దుకాణాల్లో అమ్మి సొమ్ము చేసుకున్నారు. మిగిలిన వాటిలో పెద్ద, పెద్ద రాళ్లు నింపారు. అయితే ప్రాజెక్టు, గుత్ప ఎత్తిపోతల పథకం ద్వారా నీటి విడుదల జరుగుతుంటే పంటలకు నీరందని పరిస్థితి ఏర్పడింది. పిల్ల కాలువల ద్వారా నీటి విడుదల పూర్తి స్థాయిలో జరుగక పోవడంతో నందిపేట మండల కేంద్రంలోని తాళ్ల చెరువు, ఊర చెరువులు నిండుకున్నాయి. గుత్ప నీరు రాకపోవడంతో చెరువులు ఎండుముఖం పట్టాయి. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే వేసవిలో పశువుల తాగునీటికి అన్నదాతలు ఇబ్బంది పడాల్సిందే. సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి వాటికి మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. గుత్ప లిఫ్ట్ ద్వారా నీటి నింపాలని వేడుకుంటున్నారు.

సిమెంట్ లైనింగ్ చేయాలి..

: బండి నర్సాగౌడ్, బజార్ కొత్తూర్

నిజాసాగర్ ప్రాజెక్టు డిస్ట్రీబ్యూటరీ కెనాల్స్, పిల్ల కాల్వలు, అర్గుల్ రాజారాం ఎత్తిపోతల పథకం గ్రావిటీ కెనాల్‌కు సిమెంట్ లైనింగ్ చేయాలి. కాలువలోఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలి. అంతే కాకుండా జంగిల్ కట్టింగ్ చేయాలి. ఇరువైపులా ఉన్న కట్టలను వెడల్పు చేసి మట్టి, కంకర పోయాలి.

షట్టర్లు బిగించాలి..

: పెంట ఇంద్రుడు, కంఠం

ప్రతీ తూముకు షట్టర్లు బిగించాలి. అంతే కాకుండా శిథిలావస్థలో ఉన్న తూముల స్థానంలో కొత్త వాటిని నిర్మించాలి. కెనాల్‌లో పేరుకు పోయిన పూడికను తొలగించాలి. ఎగువకు నీరు చేరడానికి తూముల వద్ద సిమెంట్‌తో బెడ్లులు నిర్మిస్తే బాగుంటుంది. లేదంటే నీళ్ల అందని రైతులు కట్టలో అడ్డంగా కట్టలు వేస్తారు.

'ప్రజావాణి'కి వినతుల వెల్లువ



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ తదితరులు

నిజామాబాద్ అర్బన్, మార్చి 11:ప్రజావాణి కార్యక్రమానికి 95 వినతులు వచ్చాయి. ప్రతి సోమవారం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ఈ వారం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అదనపు కలెక్టర్లు కిరణ్‌కుమార్, అంకిత్, నగర పాలక సంస్థ కమీషనర్ మకరంద్, ట్రైనీఐఏఎస్ కిరణ్మయి తదితరులు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను వెంటవెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేతనం రూ.10వేలు ఇవ్వాలని, అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయాలన్నారు. గౌరవ వేతనం, అల్పాహారం బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి, కొండ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

● న్యాయం చేయాలి

నగర శివారులోని బర్దిపూర్ పరిధిలోని సర్వే నెంబర్ 265/పి/1, 2, 1/1, 1/2, 265/ఎ2, 265/పి3, 265/పి, 1248/2 సర్వే నెంబర్లలో జేజే డెవలపర్స్ వెంచర్ చేయగా అందులో తామంతా ప్లాట్లు కొనుగోలు చేశామని కానీ ఫైనాన్షియల్ ఇబ్బందుల వల్ల డెవలపర్స్ 9 మంది ఫైనాన్సర్ల వద్ద 14 కోట్లు అప్పుగా తీసుకున్నారని అవి చెల్లించకపోగా ఇప్పుడు ఫైనాన్షియర్లు ఆభూమిని స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నారని అందులో డెవలపర్స్ నుంచి ప్లాట్లను కొనుగోలు చేసిన తమకు అన్యాయం జరుగుతుందని కావున తమకు న్యాయం చేయా లని బాధితులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారి లో ఎల్.శ్రీధర్, కె.శివాజీ, బి.గంగాధర్, అరుణ్ కుమార్, నారాయణరెడ్డి, భరత్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, ప్రమోద్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

● తమ భూమిని తమకు ఇవ్వాలని వినతి

ఆలూర్ గ్రామంలోని సర్వేనెంబర్ 679/1, 678, 672/2, 677లలో సుమారు 4ఎకరాల 20 గుంటల స్థలం తమకు వారసత్వంగా సంక్రమించిందని గత 55 ఏళ్లగా తాము ఆ భూమిలో కబ్జాలో ఉన్నామని సాగు చేసుకుంటున్నామని కానీ తమ భూమి పక్కన ఉన్న గడ్డం యశోధ అక్రమంగా మా భూమిలో చొరబడి గొడవ పడుతూ ఆక్రమించుకునే ప్రయత్నం చేయగా న్యాయస్థానాన్ని ఆశ్రయించామని కానీ తాము లేని సమయంలో 8 గుంటల భూమిని యశోధ ఆక్రమిం చుకున్నారని కావున మా భూమిని మాకు ఇచ్చి మాపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన ఇసపల్లి సుమలత కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

సంక్షిప్త సమాచారం

మార్కండేయ మందిరంలో ఎమ్మెల్సీ పూజలు



మార్కండేయ మందిరంలో పూజలు చేస్తున్న మహేష్‌కుమార్‌గౌడ్

నిజామాబాద్ అర్బన్, మార్చి 11: టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ సోమవారం నగరంలోని మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇటీవల ఆలయ నూతన నిర్మాణం చేపట్టగా ఎమ్మెల్సీ సోమవారం ఆలయాన్ని ప్రత్యేకంగా సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, ఇతర కార్యవర్గం ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర ఉర్దూ అకాడమి ఛైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలితలను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో దళిత కల్యాణ సమితి జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను మహేష్‌కుమార్‌గౌడ్ ఆవిష్కరించారు.

జాతీయస్థాయి హాకీపోటీలకు జిల్లా క్రీడాకారులు



ఎంపికైన క్రీడాకారులు

సుభాష్‌నగర్, మార్చి 11: జాతీయస్థాయి సీనియర్ మహిళ హాకీ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గంగారెడ్డి, రమణలు తెలిపారు. జిల్లాకు చెందిన దార్ల ప్రీతి, మమత, శ్రీచం దనలు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 13 నుంచి 23వరకు పూణేలో జరిగే జాతీయస్థాయి పోటీల్లోపాల్గొంటా రని తెలిపారు.ఈసందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిభ కనబర్చి అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనాలన్నారు. ఇందులో పాల్గొని తీసుకున్న సర్టిఫికెట్లకు ప్రభుత్వ ఉద్యో గంలో రెండు శాతం ఉద్యోగానికి రిజర్వేషన్ కల్పించబడుతోందని తెలిపారు. జాతీ యస్థాయికి ఎంపికైన క్రీడాకారులను ఉపాధ్యక్షుడు విద్యాసాగర్ రెడ్డి, కోశా .ధికారి పింజ సురేందర్, సంఘ సభ్యులు జీవీ నర్సింహారెడ్డి, అరీఫ్, జావేద్, చిన్నయ్య, హర్షవర్ధన్ రెడ్డి,అంజు,నగేష్, సంతోష్, సీనియర్ క్రీడాకా రులను అభినందించారు.

వరి పంటల పరిశీలన

రెంజల్,మార్చి11: మండలంలోని బాగేపల్లి గ్రామంలో సోమవారం జిల్లా వ్యవసాయ అధికారి వాజీద్ హుస్సేన్ వరిపంటలను పరిశీలించారు. పంట పొలాలలోకి వెళ్లి రైతులను అడిగి సాగునీరు లభ్యత గురించి, పంటలో చీడపీడల నివారణ గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. పంట పొలాల్లో చీడపీడల నివారణకు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలని రైతులకు సూచించారు. అలాగే వ్యవసాయ విస్తీరణ అధికారులు చేసిన పంట నమోదు వివరాలను పరిశీలించారు. ఎప్పటికప్పుడు అధికారులు అందుబాటులో ఉండి రైతులకు సరైన సలహాలు, సూచనలు అందించాలని అన్నారు. ఆయన వెంట వ్యవసాయ అధికారి లక్ష్మి కాంత్ రెడ్డి, వ్యవసాయ విస్తీరణ అధికారి కవిత, రైతులు సురేందర్ గౌడ్, శంకర్ గౌడ్, సతీష్, ప్రవీణ్, సుదర్శన్ తదితరులున్నారు.

పోలీసుల అదుపులో నిందితులు

డిచ్‌పల్లి, మార్చి 11: డిచ్‌పల్లి మండలంలోని నడిపల్లి తండా శివారు ప్రాంతంలో మేకల సంత వద్ద సోమవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందిన మేకను దళారులు విక్రయించడానికి ప్రయత్నాలు చేస్తుండగా స్థానికులు డిచ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై మహేశ్ ఆధ్వర్యంలో మేకను విక్రయిస్తున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత కొంత కాలంగా మాంసం విక్రయించే నిజామాబాద్, డిచ్‌పల్లి వ్యాపారులు ఈవ్యవహరానికి తెరలేపారని అనారోగ్యంతో చనిపోయిన మేకలను మాంసం దుకాణ దారులకు తక్కువ రేటుకు విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం అడుతున్నారని స్థానికులు తెలిపారు. పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో మాంసం విక్రయాదారుల రెచ్చిపోతున్నారు.

'పండుగలను శాంతయుతంగా జరుపుకోవాలి'

రెంజల్,మార్చి11: రంజాన్ పండుగను శాంతియుతవాతావరణలో జరుపుకుని, సోదరభావంతో మెలగాలని ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని సాటాపూర్ గ్రామంలోని రైతు వేదికలో మండలంలోని అన్ని గ్రామాల ముస్లిం సోదరులతో శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ 41రోజుల పాటు ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరులు సోదరభావంతో మెలగాలని, పండుగలను అందరు కలిసి కట్టుగా జరుపుకోవాలని సూచించారు. ఎటువంటి అల్లర్లకు తావులేకుండా అవాంచనీయ సంఘటనలు జరుగకుండా శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో రూరల్ సీఐ నరేష్, ఏఎస్ఐ రవీందర్, పోలీసు సిబ్బంది నారాయణ, శంకర్ రెడ్డి, వివిధ గ్రామాల ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

బోధన్ ఆర్డీవోగా సీదం దత్తు

బోధన్ రూరల్, మార్చి 11 : బోధన్ ఆర్డీవోగా సీదం దత్తు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మంచిర్యాల జిల్లాలో భూ సేకరణ విభాగంలో డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహించిన సీదం దత్తు సోమవారం బోధన్ ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డివిజన్ స్థాయి తహసీల్దార్లు పలువురు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధన్ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను అధికారులు సమన్వయంతో పని చేసి ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

లక్షతో పాటు తులం బంగారు కూడా ఇవ్వాలి

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

పెద్దబజార్,మార్చి11: కల్యాణ లక్ష్మి,షాదీమాబారక్ పథకం కింద లక్ష రూపాయల తో పాటు తులం బంగారు కూ డా ఇవ్వాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్‌సూర్యనారాయణ గుప్తా అన్నారు. సోమవారం రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కళ్యాణలక్ష్మి, షాదీ ము బారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డ పెళ్లికి వారి కుటుంబానికి ఆర్థిక భరోసాగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్షా 116 పంపిణీ చేసిందని అన్నారు. ఈ చెక్కులు జారీ చేయడంలో జాప్యం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం అర్జి పెట్టుకున్న అర్హులందరికి వీలైనంత త్వరగా చెక్కులు విడుదల చేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తానన్న హామీ నెరవేర్చాలని ఆడబిడ్డలు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారని అన్నారు. సోమవారం నగరంలో అర్హులైన 895 మందికి చెక్కుల పంపిణీ చేశారు. అందులో కళ్యాణలక్ష్మి 211, షాదీముబారక్ 684 అర్హులకు చెక్కులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, బీజేపీ మున్సిపల్ లీడర్ స్రవంతిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు రోషన్‌లాల్‌బోరా, బంటురాము, ఆకుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో ఒకరు డిబార్

నిజామాబాద్ అర్బన్, మార్చి 11: జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలో సోమవారం ఓ విద్యార్థి మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతుండగా అధికారులు డిబార్ చేశారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన మొదటి సంవత్సరం అర్ధసంవత్సరం, భౌతిక శాస్త్రం పరీక్షల్లో మొత్తం 19,454 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 18,613 మంది హాజరుకాగా, 841 మంది గైర్హాజరయ్యారు. నవీపేట మోడల్ జూనియర్ కళాశాలలో ఓ విద్యార్థినిపై మాస్ కాపీయింగ్ కేసు నమోదు చేశారు. డీఈసీ కమిటీ7, హెచ్‌పీసీ కమిటీ 6, ఫ్లయింగ్ సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు 33, డీఐఈవో రఘురాజ్ 3 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



డాక్టర్ సుదర్శనం

పెద్దబజార్, మార్చి 11: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో వివిధ పోస్టుల కోసం దళారులను నమ్మి మోసపోవద్దని దరఖాస్తు గడువు సోమవారంతో ముగిసిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుదర్శనం తెలిపారు. ఆర్‌బీఎస్‌కెలో, జాతీయ ఆరోగ్య మిషన్‌లో వివిధ పోస్టుల కోసం వైద్యాధికారులు ఎంఎల్ హెచ్‌పీ లు, స్టాఫ్‌నర్సులు, డాటాఎంట్రీ ఆపరేటర్లు, న్యూట్రిషి యన్ కౌన్సిలర్, ఏపీ డామాలాజిస్టు, ఏఎన్ఎం, ఫార్మసిస్టు, డిస్ట్రిక్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఉద్యోగాల కోసం ఇచ్చిన నోటిఫికేషన్ దరఖాస్తు గడువు ముగి సిందన్నారు. ఈ పోస్టు లను పూర్తి పారదర్శకంగా ప్రభుత్వ ఉత్తర్వుల సహ కారమే నియామకాలు చేపడుతామని తెలిపారు. నియామకాల విషయంలో ఎలాంటి దళారులు, పైరవీలు, రికమండేషన్లు అంగీకరించవని తెలిపారు. దరఖాస్తుదారులు పైరవీలకు సంబంధించిన సమాచారం తెలిస్తే తమ కార్యాలయంలో తెలియజేయాలని కోరారు.

అనుమతులు లేని పాఠశాలలను మూసి వేయండి



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న ఏబీవీపీ నాయకులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నిజామాబాద్ అర్బన్, మార్చి 11:జిల్లాలో అనుమతులు లేకుండా పాఠశాలలను ప్రారంభించిన, అడ్మిషన్లు తీసుకున్న ఆ పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని అలాంటి పాఠశాలలను గుర్తించి వెంటనే సీజ్ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్ ఎంఈవోలను ఆదేశించారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి' జిల్లా ఎడిషన్‌లో అనుమతులు లేకుండానే అడ్మిషన్లు అనే శీర్షికన వచ్చిన కథనానికి జిల్లా విద్యాశాఖ అధికారి స్పందించారు. జిల్లాలో 'ఎలాంటి అనుమతులు లేకుండా అడ్మిషన్లు ప్రారంభించినా.. అనుమతులు వచ్చాయంటూ ప్రచారం నిర్వహించిన అలాంటి పాఠశాలలను సీజ్ చేయాలని డీఈవో ఆదేశించారు. అదేవిధంగా షిఫ్టింగ్ పర్మిషన్లు లేకుండా పాఠశాలలను తరలించిన, ఇంకా దరఖాస్తు చేయకుండానే నూతన భవనాలలో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రచారం నిర్వహించిన అలాంటి పాఠశాలలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆయన ఎంఈవోలను ఆదేశించారు.

● నిశిత ఇంటర్నేషనల్ పాఠశాల అనుమతులను రద్దు చేయాలి

ఎలాంటి అనుమతులు లేకుండా ఇంకా పాఠశాల అనుమతి కోసం దరఖాస్తు చేసుకోకుండానే అడ్మిషన్లు నిర్వహిస్తున్న నిశిత ఇంటర్నేషనల్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సునీల్ ఆధ్వర్యంలో విద్యార్థి నాయకులు సోమవారం 'ప్రజావాణి'లో ఫిర్యాదు చేశారు. ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో నగరంలో పెద్ద పెద్ద హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి నిశిత యాజమాన్యం అడ్మిషన్లు ప్రారంభించినట్లు ప్రచారం చేసుకుంటుందని కానీ ఇప్పటికీ ఇంకా పాఠశాల అనుమతులకు సంబంధించి ఫైలు విద్యాశాఖకు చేరలేదని కావున ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఒక అంతస్తు మాత్రమే నిర్మాణం పూర్తి కాగా మరో రెండు నెలల్లో విద్యాసంవత్సరం ప్రారంభమవుతోందని మిగిలిన భవనం ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి ఉందని కానీ అనుమతులు వచ్చేశాయి అంటూ అడ్మిషన్లు ప్రారంభించడం సరికాదని వెంటనే ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాయికుమార్, దుర్గాదాస్, వినయ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం పై హర్షం

● సీఎం చిత్రపటానికి పూలాభిషేకం

నిజామాబాద్ అర్బన్, మార్చి 11: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించడం హర్షనీయమని ఇండ్ల సాధన కమిటీ అధ్యక్షుడు కృష్ణ, ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల గోవర్ధన్ ఆధ్వర్యంలో సోమవారం నూతన కలెక్టరేట్ ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పూలాభిషేకం నిర్వహించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇండ్ల పేరుతో మోసం చేసిందని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోపే ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించడం హర్షనీయమని గోవర్ధన్ అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, గంగాధర్, భాస్కర్, లావణ్య, రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్లలో నేడు మండల సర్వసభ్య సమావేశం

ఏర్గట్ల, మార్చి 11: మండల కేంద్రంలో నేడు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఉపేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఓప్రకటనలో తెలిపారు.ఇట్టిసమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ శాఖలకు సం బంధించిన అధికారులు ఉదయం 11గంటలకు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

నడిపల్లి తైబజార్ వేలం

డిచ్‌పల్లి, మార్చి 11: మండల కేంద్రంలోని నడిపల్లి గ్రామ పంచాయతీలో స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ గౌడ్, గ్రామ పంచాయతీ ఈవో కిషన్ రావులు సోమవారం తైబజార్ వేలాన్ని నిర్వహించారు. డీపీవో కార్యాలయం నుంచి సర్కారీ వారి పాట రూ.13,70,000 రావాలని చెప్పడంతో కొందరు వ్యాపారులు రూ.13,10,000లకు వేలం వేసి ఏవరు మరేవరు ముందుకు రాకపోవడంతో వేలం ను వాయిదా వేసినట్లు ఈవో కిషన్ రావు తెలిపారు. ఈవేలం పాటనేడు తిరిగి వేలం నిర్వహన ఉంటుందని ఆయన తెలిపారు.

ఆటో బోల్తాపడి 9మందికి గాయాలు

డిచ్‌పల్లి, మార్చి 11: డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సాంపల్లి వద్ద జాతీయ రహదారి 44పై ఆటో బోల్తా పడి 9మందికి గాయాలు అయ్యాయని ఎస్సై మహేశ్ తెలిపారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణి కులను తీసుకెళ్లడం,అతివేగంతో అదుపు తప్పి ఆటోబోల్తా పడినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని ఎస్సై తెలిపారు.డ్రైవర్ సలీంపై కేసు నమో దు చేసినట్లు ఎస్సైపేర్కొన్నారు.బాధితులను జిల్లాకేంద్రఆస్పత్రికి తరలించారు.

పెర్కిట్ సొసైటీ ఛైర్మన్‌పై వీగిన అవిశ్వాస తీర్మానం

ఆర్మూర్‌రూరల్, మార్చి11: పెర్కిట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ ఛైర్మన్ బోజారెడ్డి సోమవారం ప్రవేశపెట్టి అవిశ్వాస తీర్మానం విగిపోయింది. సొసైటీ 13మంది డైరెక్టర్‌లు ఉండగా గతంలో ఒక డైరెక్టర్ మృతి చెందడంతో ప్రసుత్తం 12మంది డైరెక్టర్‌లు ఉన్నారు. అవిశ్వాస పరీక్షలో ఎనిమిది మంది డైరెక్టర్‌లు చేతులెత్తడంతో అవిశ్వాసం విగిపోయింది. అవిశ్వాస తీర్మాణం నెగ్గాలంటే తొమ్మిది మంది డైరెక్టర్‌ల మద్దతు అవసరం. దీంతో అవిశ్వాస తీర్మాణం విగిపోయినట్టు డీసీవో శ్రీనివాస్ తెలిపారు. దీంతో సొసైటీ ఛైర్మన్‌గా పెంట బోజారెడ్డి కొనసాగనున్నారు.

బ్యాంకు దొంగతనానికి యత్నం

ఆర్మూర్‌టౌన్ , మార్చి11: మండలంలోని పిప్రి గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకును గుర్తుతెలియని దొంగలు ఆదివారం రాత్రి దొంగతనానికి యత్నించారు. బ్యాంకు యొక్క కిటికి రాడ్లను తొలగించి గుర్తుతెలియని ఇద్దరు దొంగలు లోపల చొరబడి బ్యాంకులోని లాకర్‌ను పగులగొడుతుండగా సైరన్ మోగాడంతో పరారయ్యారు. దీంతో బ్యాంకు సిబ్బందికి వచ్చిన సమాచారం మేరకు 100 నెంబర్‌కు ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని ఆధారాలను సేకరించారు. బ్యాంకు మేనేజర్ రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌హెచ్‌వో రవికుమార్ తెలిపారు.

చిక్కడ్‌పల్లిలో ఒకరి ఆత్మహత్య

రుద్రూరు,మార్చి 11: ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రుద్రూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది.ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం రుద్రూరు మండలంలోని చిక్కడ్‌పల్లి గ్రామానికి చెందిన మచ్చూకారి శంకర్ (38) అనే వ్యక్తి ఆర్థిక పరిస్థితులు బాగ లేక, కుటుంబ పోషణకై అప్పులు చేశాడని, అట్టి అప్పులను తిరిగి తీర్చలేక జీవితంపై విరక్తి చెంది ఆదివారం తన ఇంట్లో మిద్దెపైన ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై తెలిపారు. మృతుడి భార్య జానకి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మున్సిపల్‌లో బడ్జెట్ సమావేశం

ఆర్మూర్‌టౌన్ , మార్చి11: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఇన్‌చార్జీ చైర్మన్ షేక్‌మున్న అధ్యక్షతన సోమవారం మున్సిపల్ బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. గత సంవత్సరం అంచనా ఆదాయంలో రూ.86లక్షల 75వేల మిగులు ఆదాయం కాగా ఈ సంవత్సరం అంచన ఆదాయ వ్యయాలు రూ.19కోట్ల 67లక్షల 95వేలు నిర్ణయించారు. దీంతో కౌన్సిల్ సభ్యులందరు ఏకగ్రీవంగా ఆమోదించి తీర్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, డీఈ భూమేశ్వర్, ఏఈ రఘు, సానిటరి ఇన్స్‌పెక్టర్ మహేష్, కౌన్సిలర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

● ఇన్‌చార్జీ చైర్మన్‌గా బాధ్యతలు

ఆర్మూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్‌మున్న ఇన్‌చార్జీ చైర్‌పర్సన్‌గా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి దాన కిశోర్ మున్సిపల్ బడ్జెట్ సమావేశం నిర్వహించాలని అందుకు గాను ఇన్‌చార్జీ బాధ్యతలను షేక్ మున్నకు అప్పగించినట్టు ఉత్తర్వులో పేర్కొన్నారు. దీంతో కౌన్సిలర్‌లు, ప్రముఖులు షేక్ మున్నను అభినందించారు.

● జిల్లా కలెక్టర్ మున్సిపల్‌పై చొరవ చూపాలి

మున్సిపల్ పరిధిలోని ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జిల్లా కలెక్టర్ చొరవ చూపాలని బీజేపీ ఫ్లోర్ లీడర్ జీవీ.నర్సింహారెడ్డి అన్నారు. మున్సిపల్ బడ్జెట్ సమావేశం అనంతరం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఆయన మాట్లాడుతూ ఐదు నెలలుగా మున్సిపల్ సమావేశం నిర్వహించలేదని, పాలకులు లేకుండా ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారని ప్రజా పాలనలో లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్న గాని లబ్ధిపొందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కసారి కలెక్టర్ మున్సిపల్‌ను సందర్శిస్తే సమస్యలు అవగతం అవుతాయని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన స్పందించడంలేదని, ఇదీ సరియైన పద్ధతికాదని తక్షణమే పాలన కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఆయన వెంట కౌన్సిలర్ సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.



బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జీ చైర్మన్ షేక్ మున్న



బడ్జెట్ సమావేశానికి హాజరైన సభ్యులు

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.220	రూ. 260
వెన్‌కాబ్(కిలో)	రూ.160	రూ.230	రూ. 270

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.65,700	రూ.60,600	రూ.760

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

- స్క్రీన్-1 : శైతాన్ (హిందీ)(10.20,1.20,4.20,7.20,10.20)
- స్క్రీన్-2 :గామి(10.00, 1.10, 4.20, 7.35, 10.45)
- స్క్రీన్-3 : భీమా (12.20,6.55) : దునే పార్ట్-2 (ఇంగ్లీష్) (3.25) :ఆపరేషన్ వాలెంటైన్ (10.00)
- స్క్రీన్-4 : బాబు (1.30) : రికార్డుబ్రేక్ (4.15) :మంజుమెల్‌బాయ్స్ (మళయాలం) (7.15) ప్రేమలు (10.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

- స్క్రీన్-1 : భీమా (10.50,1.40, 4.30,7.30,10.30)
- స్క్రీన్-2 ప్రేమలు (1.30,7.30) :ఆపరేషన్ వాలెంటైన్ (4.30,10.30)
- స్క్రీన్-3 :గామి(10.30, 1.30, 4.30, 7.30, 10.30)

- దేవి ప్రేమలు (11.15, 2.15, 6.15, 9.15)
- లలితమహాల్ : భీమా (11.15, 2.15, 6.15 9.15,)
- నటరాజ్ : శైతాన్ (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
- విజయ్ : గామి (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్